# వేకువజాము కలలు

"అదేమది! విధీ! పునర్లభ్యమౌతున్న 'కానుక ప్రవృత్తి' నంతా అలా భండారాల్లో దాచేసుకుంటున్నా వెందుకు?"

''ఆఁ నిలవ్వేస్తున్నాను. నా భవిష్యద్ దృష్టిలో భారతనారులలో యిది యెక్కువ వాళ్ళల్లో వుపయోగించవలసి వుంది".

"ఏం? తక్కిన జాతుల మాట యేంకాను?!"

"అది వేరే ప్రశ్న. పాపం! కొన్నాళ్ళదాదిగా యింతవరకూ వాళ్ళకు అన్యాయం చేస్తూ వచ్చాను. నిర్లిప్తంగా సృష్టించి సర్వసంపన్నమూ, ఆనందమూ, ఊహాతీతమూ అయిన నా సృష్టిలో ఏ స్వల్ప విషయాన్నీ కూడా గ్రహించలేని అజ్ఞాన స్థితిలో – వంట యిళ్ళల్లో – చీరలూ, నగలూ, శాకపాకాలూ గూర్చిన చర్విత చర్వణపు సంభాషణల్లో – ఏహ్యమూ, దుర్భరమూ అయిన తిట్లూ తిరస్కారాలూ నడుమ బురద గుంటల్లోని పురుగుల్లా జీవింపచేశాను. నేడా భరతఖండం . ఆ నారీలోకం పునరుద్ధరింపబడాలి. స్త్రీ ప్రతి విషయాన్నీ తెలుసుకుని పురుషునితో సమానంగా సర్వతోముఖంగా ముందడుగు వెయ్యాలి".

'అయ్యో! విధీ! అదేమది–అసూయ, న్యూనతా భయం Inferiority Complex, కపటము దురాశ, పరనిందా గుణం, వ్యామోహము, బడాయి, పరావలంబనం, దాసీత్వం, కన్నీళ్ళు, నిర్లిప్తత – యివన్నీ నీ భండారాల్లో పేరుకొని అలా అలా గుట్టలుగా పెరిగిపోతున్నాయేం?"

"ఏం మందమతివి! చెప్పలేదా – భారతనారీ సంఘం పునరుద్ధరింపబడుతోందని, ఇరవై కోట్ల భారత స్త్రీలలో యింతవరకూ పాతుకపోయి వున్న యీ క్షుద్ర గుణాలన్నీ, (Repeat) క్షుద్ర గుణాలన్నీ పీకివేసి, వీని స్థానే ధీరత్వం, ఆత్మ విశ్వాసం,. ఆత్మగౌరవం, సహనశీలతా, త్యాగశీలతా, సమబుద్ధి, కౌతుకతా, దయ, ఓరిమి, గాంభీర్యత, లాలిత్యత, లాలనాశీలతా, పాలనా దక్షత, మొదలైనవి ప్రసాదింపబడుతున్నాయి.

హిమాలయ శిఖరాలూ, అంతెరుగని అగాధాలూ తోడి అగమ్య ప్రదేశాల్లా వున్న సాంఘిక, ఆర్థిక రంగాలను – చదునుచేసి సమత్వము సాధింపపూనిన పురుషునకు – స్త్రీ అండగా నిలిచి, దినదినానికీ చల్లారుతూ పోయే అతని ఉత్సాహజ్యోతికి నవ ప్రకాశాన్నివ్వాలి.

పైశాచిక భక్తులైన మానవకోటిని అహింసతో యెదుర్కొని, దాని అద్వితీయతను ప్రతిష్ఠాపించబోయే పురుషునకు – స్త్రీ ఆ దుష్కర కార్యంలో – ఆ మహాకార్యంలో అతడు శిథిలోత్సాహుడైనపుడు అతని అండను నిలచి ధైర్యాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ, ఉత్సాహాన్నీ పునఃసృష్టి చేస్తుండాలి.

శిధిలమైన భారతీయ ఆధ్యాత్మిక, ఆదిభౌతిక విజ్ఞానాన్ని పునః ప్రతిష్ట చేయదలచిన పురుషునకు – స్త్రీ దక్షిణ హస్తమై నిలవాలి.

అందుకు – అందుకూ భారతనారికీ అద్వితీయ వరాలన్నీ ప్రసాదింపబడుతున్నాయి".

"ఇది అన్యాయం కాదా విధీ! తదితర జాతులన్నీ భారతజాతి నీకే మాత్రపు దగ్గర చుట్టమని యీ వరాలన్నీ దొంగతనంగా దాచి యిస్తున్నావు?"

"–నీకర్థం కాదు. ఈశ్వరునీ, ఈశ్వర ప్రీతియైన సర్వమానవ కల్యాణ సూత్రాన్నీ గ్రహించి, సాధింప ప్రయత్నిస్తున్న జాతుల్లో భారతజాతి యీమధ్యనే అకస్మాత్తుగా ప్రథమ స్థానం ఆక్రమించింది. ఇతర జాతులు హింసను పూజించి ప్రేరేపిస్తూ సృష్టి నాశనానికి దారితీస్తున్నాయి. ఈ ప్రతికూల వాతావరణంలో భారతజాతి తన సన్మార్గంలో విశ్వాసం కోల్పోకుండా నిలవటానికి యీ వరాలు చాలా అవసరం".

''కాని – విధీ! యిందులో నాకేదో పక్షపాతం అగపడుతోంది. నువ్వు – నువ్వే! – సర్వమతాబాధ్యత కలిగివున్న నువ్వే – యిలా... యిలా... న్యాయమా!"

"(తేరిపారజూసి) – నువ్వు – నువ్వు భారతీయుడవా!"

★

*(చిత్రాంగి: డిసెంబర్ స్పెషల్ 1946)*